JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | ఆదివారం 15-02-2026
Medchal - Malkajgiri | Sunday 15-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 260
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 260 | Pages : 8 | ₹ : 5

## ప్రధాన పార్టీలను మట్టికరిపించిన కవిత

- మొత్తం 10 వార్డులకు గాను ఏకంగా 8 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు ఘనవిజయం సాధించగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో ఒక స్థానానికి పరిమితమయ్యాయి



**జయభేరి, మహబూబ్ నగర్, ఫిబ్రవరి 14 :**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ వేదికగా ఒక అరుదైన రాజకీయ సంచలనం నమోదైంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు షాక్ ఇస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇక్కడ మొత్తం 10 వార్డులకు గాను ఏకంగా 8 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు ఘనవిజయం సాధించగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో ఒక స్థానానికి పరిమితమయ్యాయి.ఈ విజయం వెనుక ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యూహం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డేపల్లిలో బలమైన నేతగా పేరున్న వడ్డేపల్లి శ్రీనన్న కొద్ది రోజుల క్రితమే కవిత సారథ్యంలోని

...మిగతాది 2 లో



2 లో

## రైతుల ఖాతాల్లో భరోసా సొమ్ము

- రైతు భరోసా సాయం సొమ్ములు ఫిబ్రవరి 17వ తేదీ లేదా 18వ నుంచి బ్యాంకు ఖాతాల్లో
- తొలి రోజు ఒక ఎకరా నుంచి ప్రారంభించి మొత్తం తొమ్మిది రోజుల పాటు ఈ మొత్తాన్ని వారి వారి ఖాతాల్లో జమ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో ఫిబ్రవరి 17 లేదా 18 నుంచి రైతు భరోసా సాయం జమకు సిద్ధం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలపై రైతుల ఖాతాల్లో నిధులు. కొత్త దరఖాస్తులపై ఇంకా స్పష్టత లేదు..

హైదరాబాద్ రైతాంగం ఆశగా ఎదురు చూస్తున్న రైతు భరోసా సాయం సొమ్ములు ఫిబ్రవరి 17వ తేదీ లేదా 18వ నుంచి బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్ర ఆర్థిక శాఖ రైతు భరోసా పథకానికి అవసర మైన నిధులను ఇప్పటికే సమకూర్చుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఆదేశాలు రాగానే బ్యాంకు ఖాతాల్లో సాయం సొమ్ములు జమ చేయున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం, ప్రజల నుంచి సానుకూలత ఉండడంతో మార్చి నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఉంది ..ఈ నెలాఖరు కు పరిషత్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యా నిస్తున్నాయి. గత వానాకాలంలో 2025, 26 ఖరీఫ్ సీజన్, 69,39,548 మంది లబ్ధిదారుల ఖాతాలలో రైతు భరోసా సాయం వేశారు. ఒక ఎకరా కు రూ.6 వేల చొప్పున మొత్తం రూ.8,744.13 కోట్లు బదిలీ చేశారు.



7 లో

## మహా శివరాత్రి

మహా శివరాత్రి గురించి స్కాంద పురాణం, లింగ పురాణం, పద్మ పురాణాలతో సహా అనేక పురాణాలలో ప్రస్తావించబడింది. ఈ మధ్యయుగపు శైవ గ్రంథాలు ఈ పండుగను వివిధ రకాలుగా వర్ణించాయి. వీటిలో ఉపవాసం, శివుని చిహ్నంగా భావించే శివలింగానికి పూజలు చేయడం వంటివి ఉన్నాయి. వివిధ పురాణాలు మహా శివరాత్రి యొక్క ప్రాముఖ్యతను వివరిస్తాయి. శైవ సంప్రదాయంలో ఒక పురాణం ప్రకారం, సృష్టి, స్థితి, లయ కారకుడైన శివుడు తాండవం చేసే రాత్రి ఇది. స్తోత్రాలు, శైవ గ్రంథాల పఠనం, భక్తుల హోరు ఈ విశ్వ నృత్యంలో చేరి, ప్రతిచోటా శివుని ఉనికిని గుర్తు చేస్తుంది. మరొక పురాణం ప్రకారం, ఇది శివుడు మరియు పార్వతి వివాహం చేసుకున్న రాత్రి. వేరొక పురాణం ప్రకారం శివరాత్రి అనేది సంవత్సరానికొకసారి శివలింగాన్ని పూజించడం, గతంలో చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి, పుణ్యమార్గంలో జీవించి కైలాసాన్ని చేరుకోవడం. క్షీరసాగర మథన సమయంలో ఉద్భవించిన హాలాహలాన్నుంచి ప్రపంచాన్ని కాపాడటం కోసం శివుడు దాన్ని సేవించి కంఠంలో దాచుకుని నీలకంఠుడనే పేరు పొందిన రాత్రి ఇది.

## రూ. 3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2026-, 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా రూపొందించిన ఈ బడ్జెట్ లో సంక్షేమం, మౌలిక సదుపాయాలు. పరిశ్రమలు, వృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారుఒకసారి ఒటాన్ అకౌంట్ బడ్జెట్... రెండు సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టారు ఆర్థిక మంత్రి పయ్యావుల. 2026-, 27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు ఆర్థిక మంత్రి రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లగా అంచనా. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి ఏడాదే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేశాం... 11.75 శాతం వృద్ధి రేటు నమోదైందని చెప్పారు. 2025-, 26వ ఆర్థిక సంవత్సరంలో కూడా సీఎం చంద్రబాబు నేతృత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రెండంకెల వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తున్నాం అన్నారు పయ్యావుల కేశవ్.



2 లో

- 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామని తెలిపారు

**జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 14 :**

ఆంధ్రప్రదేశ్2025, 26 ఏడాదిలో కూడా 10.75 శాతం మేర వృద్ధి నమోదు అవుతుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోందన్నారు. 2025, 26వ ఏడాదిలో ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయని... ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలతో దేశం శక్తిమంతంగా ఉందనే గుర్తింపును అంతర్జాతీయ స్థాయిలో సాధించడం ప్రధాని మోదీ వల్లే సాధ్యమైందని చెప్పాలన్నారు పయ్యావుల కేశవ్. దేశ ప్రయోజనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ రాజీ పడదని మోదీ గట్టి సంకేతాలు ఇచ్చారని బడ్జెట్ ప్రసంగంలో అన్నారు.ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్లో ప్రత్యేకంగా ప్రస్తావించారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణ చర్యలను బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో పొందుపరిచారు. ఈ తరహా అంశాలను బడ్జెట్టులో ప్రస్తావించడం ఇదే తొలిసారి అని గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామన్నారు ఆర్థిక మంత్రి.గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు పయ్యావుల. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామని తెలిపారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ. 43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ. 327 కోట్ల మేర ఆదా అయిందని. మరో రూ. 1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

## బీసీలకే సింహాభాగం

- బడ్జెట్ కేటాయింపులపై మంత్రి సవిత
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

**జయభేరి, అమరావతి :**

బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆనందం వ్యక్తంచేశారు. మూడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నామన్నారు.

...మిగతాది 2 లో



## మహాశివరాత్రికి ముస్తాబైన ఏడుపాయలు

**- జయభేరి, మెదక్ :**

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే వనదుర్గా భవాని మాత జాతరకు మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. మహా శివరాత్రి మహోత్సవంలో మొదటి రోజు 15 న ప్రధాన ఘట్టమైన జాతర, రెండో రోజు 16 న బండ్లు తిరుగుట, మూడో రోజు 17 న రథోత్సవం మూడు రోజుల పాటు ఇక్కడ జాతర అంగరంగ వైభవంగా జరుగనుందనీ , తెలుగు రాష్ట్రాలతోపాటు, పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్ర నుంచి దాదాపు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేయడంతో ప్రభుత్వ యంత్రాంగం. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారని ఆలయ ఈవో వీరేశం తెలిపారు. జాతర రోజుల్లో రద్దీ విపరీతంగా ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకుని వీఐపీ దర్శనం, ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనాలకు వేర్వేరు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం నుంచి ఆలయం వరకు వెళ్లే దారిలో ఎండ తగలకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు .జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు మెదక్ ఎస్పీ డివి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో 900 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రసన్నకుమార్ తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## రైతుల ఖాతాల్లో భరోసా సొమ్ము

తొలి రోజు ఒక ఎకరా నుంచి ప్రారంభించి మొత్తం తొమ్మిది రోజుల పాటు ఈ మొత్తాన్ని వారి వారి ఖాతాల్లో జమ చేశారు. వీరందరికీ ఈసారి కూడా బదిలీ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాటిలైట్ సర్వే నిర్వహించారు. ఎక్కడ సాగు భూమి ఉంది, బోగస్ లబ్ధిదారులు ఎవరు అనే వివరాలతో ఇటీవలే వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఈ సర్వేతో ఏమాత్రం సంబంధం లేకుండా వానాకాలంలో రైతు భరోసా అమలు చేసిన వారందిరికీ, ఈసారి కూడా అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. వానాకాలంలో 1.46 కోట్ల ఎకరాల భూములకు రైతు భరోసా చెల్లించారు. యాసంగిలో కూడా 1.46 కోట్ల ఎకరాలకు వర్తింప చేయనున్నారు. అయితే ఇందుకు అవసరం అయ్యే నిధులు సమకూర్చుకునేందుకు ఈ నెల 10వ తేదీన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.9వేల కోట్ల రుణం తీసుకున్నది. మున్సిపల్ ఎన్నికల కోడ్ ఈ నెల 16వ తేదీతో ముగియనున్నందున 17 లేదా 18వ తేదీ నుంచి రైతుల ఫోన్ నెంబర్లకు టింగ్ టింగ్ మంటూ మెస్సేజీలు రానున్నాయి.

జనవరి నెల సంక్రాంతి పండుగ ముందే ఈ మొత్తాన్ని జమ చేయాల్సి ఉండగా నిధుల లభ్యత లేకపోవడంతో ఈ నెలకు వాయిదా పడింది.. వానాకాలం తరువాత పలు జిల్లాల్లో వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు జరిగాయి. కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారికి నమోదు కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. పలువురు రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతిస్తే తప్ప కొత్తవారి దరఖాస్తులు స్వీకరించే పరిస్థితి లేదని అధికారులు చెప్పి పంపిస్తున్నారు. ఎప్పటి నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారనేది రైతులు చర్చించుకుంటున్నారు. వానాకాలం నుంచి ఇప్పటి వరకు ఏ తేదీని కటాఫ్ గా తీసుకుని నమోదు చేస్తారనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## ప్రధాన పార్టీలను మట్టికరిపించిన కవిత

'తెలంగాణ జాగృతి'లో చేరారు. రాష్ట్రవ్యాప్తంగా జాగృతి నేతలు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించగా, వడ్డేపల్లిలో శ్రీనన్న మద్దతుదారులు అదే గుర్తుపై బరిలోకి దిగారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో వారు సంచలన విజయం సాధించడంతో, ఈ గెలుపు కవిత రాజకీయ సత్తాకు నిదర్శనమని ఆమె మద్దతుదారులు సంబరాలు చేసుకుంటున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలు వడ్డేపల్లిలో ఆశించిన ప్రభావం చూపలేకపోయాయి. కేవలం ఒక్కో సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సామాన్య ప్రజల్లో శ్రీనన్నకు ఉన్న పట్టు, జాగృతి శ్రేణుల సమన్వయం ఈ విజయానికి బాటలు వేశాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఈ 'సింహం' గుర్తు మరిన్ని మలుపులకు కారణమయ్యేలా కనిపిస్తోంది.

**హంగ్ దిశగా...**

తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాలుగ కార్పరేషన్లను కైవశం చేసుకుంది. బీజేపీ ఒకదాంట్లో పాగా వేసింది. మిగతా ఒక్కచోట మాత్రమే హంగ్ వచ్చే అవకాశం ఉంది. అందులో కూడా కాంగ్రెస్‌కు భాగం ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. దీంతో ఒక్క కార్పొరేషన్‌లో కూడా కారుకు చోటు లేదని స్పష్టమవుతోంది. కాంగ్రెస్ పార్టీ రామగుండం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్‌లలో స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించింది. ఇంకా లెక్కింపు జరుగుతున్న మహబూబ్‌నగర్ కార్పొరేషన్లలో హస్తం పార్టీ ఆధిక్యంలో కొనసాగుతోంది. అక్కడ 60 డివిజన్‌లు ఉంటే వాటిలో 30కిపైగా డివిజన్‌లలో లెక్కింపు పూర్తి అయ్యింది. మిగతా స్థానాల్లో లెక్కింపు జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉంది. నల్గొండ కార్పొరేషన్‌లో 48 డివిజన్లు ఉంటే అందులో 27 చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. మిగతా పార్టీలన్నీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి.

కారు పార్టీ అభ్యర్థులు 9 చోట్ల, బీజేపీ అభ్యర్థులు 4 చోట్ల, ఇతరులు 8చోట్ల గెలుపొందారు. రామగుండంలో ఉన్న 60 డివిజన్‌లలో 38 స్థానాల్లో కాంగ్రెస్ గెలుచుకుంటే... 13 మంది బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచారు. బీజేపీ కేవలం ఒక్కటంటే ఒకటే గెలుచుకుంది. ఇతరులు 8 మంది విజయం సాధించారు. మంచిర్యాలలో 60 డివిజన్‌లకు 44 కాంగ్రెస్ కైవశం చేసుకుంది. బీఆర్ఎస్ 8, బీజేపీ 5 మాత్రమే గెలుచుకుంది. ఇతరులు ముగ్గురు గెలిచారు. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ వచ్చేసింది. అక్కడ ఆ పార్టీ పాలక మండలి కొలువుదీరనుంది. నిజామాబాద్ జిల్లాల్లో ఇంకా లెక్కింపు జరుగుతోంది. 60 డివిజన్‌లకు సగానికిపైగా డివిజన్‌లు కౌంటింగ్ పూర్తి అయ్యింది.

ఇందులో ఎక్కువ స్థానాలు బీజేపీ దక్కించుకుంది. తర్వాత స్థానంలో స్వతంత్రులు, ఇతర పార్టీల నేతలు ఉన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ ఖాతా తెరవలేదు. కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సొంత కార్పొరేషన్ అయిన కరీంనగర్‌లో కమలం వికసించింది. అక్కడ 66 డివిజన్‌లు ఉంటే అందులో 30కిపైగా డివిజన్‌లను బీజేపీ కైవశం చేసుకుంది. ఇంకా లెక్కింపు జరుగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ రెండోస్థానంలో ఉంటే బీఆర్ఎస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. కొత్తగూడెంలో హంగ్ వచ్చే ఛాన్స్ ఉంది. ఇక్కడ ఏ పార్టీ ఎక్కువ డివిజన్‌లు గెలుచుకోలేకపోయింది. 60 డివిజన్లు ఉన్న ఈ కార్పొరేషన్‌లో వివిధ పార్టీలు చెందిన వాళ్లు 29 గెలుచుకుంటే కాంగ్రెస్ ఇరవై రెండింటిలో ఆధిక్యం కనబరిచింది. ఇక్కడ వామపక్షాలు కీలకం కానున్నారు. వారితో పాలకమండలి కైవశం చేసుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఇక్కడ బీఆర్ఎస్ 8 డివిజన్లలోనే ఆధిక్యత చూపించింది. అయితే తమ మద్దతుతో పాలకమండలి ఛైర్మన్ కైవశం చేసుకోవాలని వామపక్షాలకు కేటీఆర్ ఆఫర్ ఇచ్చారు. దీంతో ఇక్కడ రాజకీయం ఎలా మారుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

## బీసీలకే సింహాభాగం

నూతన బడ్జెట్ లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 202627 బడ్జెట్ లో రూ.51,021 లక్షల కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 202627 బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలమైనదన్నారు.

ముఖ్యంగా బీసీల ఉన్నతికి బడ్జెట్ లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 202425 బడ్జెట్ లో రూ.39,007 కోట్లు, 202526 బడ్జెట్ 47,456 కోట్లు, 202627 బడ్జెట్లో 51,021 కోట్లు కేటాయించారన్నారు. అందులో ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,669 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 202526లో రూ.10,614 కోట్లు, 202425లో రూ.10,273.80 కోట్లు కేటాయించామన్నారు. నూతన బడ్జెట్‌లోనూ ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు, చేనేతలకు, సెల్లూన్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.150 కోట్లు, రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు.

ఇలా ఏటా బీసీ సంక్షేమానికి నిధులు కూటమి ప్రభుత్వం కేటాయింపులు పెంచుతూ వస్తోందన్నారు. చరిత్రలో ఎరుగని విధంగా, సింహాభాగం నిధులు బీసీల సంక్షేమానికి కేటాయించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. రాయలసీమ ను గ్లోబల్ హార్టీ కల్చర్ గా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు కేటాయిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా బడ్జెట్ ను రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి కూడా ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో నిధులు కేటాయించామన్నారు, బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు, ఆర్థిక మంత్రి పయ్యావులకు మంత్రి సవితకు ఆ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

# అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా..



భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు. భారత్-అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు. 2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ. అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం. రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో-రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొంటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది. ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది. ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్-డిసెంబర్ మధ్య 27% తగ్గుదల నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి.

దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి. డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది. ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం. స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు. రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.



## రూ. 3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

ఈ సంప్రదింపులు ఫలిస్తే ఏడాదికి రూ. 1658 కోట్లు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ. 24,811 కోట్లు చెల్లింపులు జరిపామని బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.

కేటాయింపులు ఇలా..

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా రూపొందించిన ఈ బడ్జెట్ లో సంక్షేమం, మౌలిక సదుపాయాలు. పరిశ్రమలు, వృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. ఏపీ ఆర్థికమంత్రి 20262027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను శాసన సభలో ప్రవేశపెట్టారు.

ప్రదాన ఆర్థిక అంచనాలు ఆర్థిక సూచికలు ఇవి
మొత్తం బడ్జెట్ వ్యయం రూ. 3,32,205 కోట్లు
రెవెన్యూ వ్యయం రూ. 2,56,142 కోట్లు
మూలధన వ్యయం రూ. 53,915 కోట్లు
రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు
ద్రవ్య లోటు రూ. 75,868
మొత్తం రెవెన్యూ ఆదాయం రూ. 2,34,140
విభాగాల వారీగా కేటాయింపులు ఇలా ఉన్నాయి.

విభాగాల వారీగా కేటాయింపుల్లో బడ్జెట్ లో విద్య, మహిళా సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి. సూపర్ సిక్స్ పథకాలు, రోడ్లు, పరిశ్రమలు సహా కొన్ని కీలక కేటాయింపులు ఇలా ఉన్నాయి

తల్లికి వందనం పథకం కోసం 9,668
మహిళా శిశు సంక్షేమం రూ. 4,581 కోట్లు
స్కాలర్‌షిప్‌లు రూ. 3,836 కోట్లు
సమగ్ర శిక్షణ రూ. 2,946 కోట్లు
ఉన్నత విద్య రూ. 2,566 కోట్లు
డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రూ.2,161 కోట్లు
మన బడి మన భవిష్యత్తు రూ. 1,500 కోట్లు
నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు
పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ. 707 కోట్లు
సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ. 654 కోట్లు
యువత క్రీడలు రూ. 438 కోట్లు
బీసీ సంఘాల కోసం రూ. 23650 కోట్లు
పంచాయతీ రాజ్ రూ.22 941 కోట్లు
కేంద్ర పన్నుల వాటా 64,362 కోట్లు
వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు రూ.2,320 కోట్లు
స్త్రీశక్తి రూ.1,420 కోట్లు
వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ రూ.600 కోట్లు
ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు
ఉపకారవేతనాలు - రూ.3,836 కోట్లు

శాఖలవారీ కేటాయింపులు మరింత వివరంగా ఇక్కడున్నాయి

పాఠశాల విద్య - రూ.32,308.32 కోట్లు
బీసీ వెల్ఫేర్ - రూ.23,650.88 కోట్లు
పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ - రూ.22,941.54 కోట్లు
వైద్యారోగ్యం - రూ.19,306.04 కోట్లు
నీటివనరులు - రూ.18,223.67 కోట్లు
పట్టణాభివృద్ధి, పురపాలిక శాఖ - రూ.14,538.68 కోట్లు
విద్యుత్ రంగం - రూ.13,934.25 కోట్లు
వ్యవసాయ రంగం - రూ.11,745.21 కోట్లు
సాంఘీక సంక్షేమం - రూ.11,118.84 కోట్లు
ఈడబ్ల్యుఎస్ సంక్షేమం - రూ.10,699.33 కోట్లు

కీలక సంక్షేమ కార్యక్రమాలు కేటాయింపులు బడ్జెట్ వివరాలు చూస్తే..

NTR భరోసా పెన్షన్ స్కీమ్ కోసం రూ. 27,719 కోట్లు... వృద్ధులు, వికలాంగులు ఇతరుల పెన్షన్లు పెంచేందుకు ఈ కేటాయింపులు చేశారు. దీపం 2 స్కీమ్ కింద రూ.2,601 కోట్లు మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత LPG సిలిండర్లు ఇవ్వనున్నారు. పారిశ్రామిక స్టార్టప్ అభివృద్ధికోసం ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఫండ్ రూ. 100 కోట్లు కేటాయించారు. ఇతర సంక్షేమ కార్యక్రమాల విషయానికొస్తే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి స్కీములకు మునుపటి కేటాయింపులే కొనసాగించారు. మత్స్యకారులకు బ్యాన్ పీరియడ్ లో ఆర్థిక సహాయం పెంచారు.

## రేవంత్ వర్సెస్ రాజగోపాల్



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మునుగోడు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపుతున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.మంత్రి పదవి కోసం రెండేళ్లుగా సర్వ శక్తులు ఒడ్డుతున్న వార్తల్లోకెక్కడం కొత్తేమి కాదు. సమయం దొరికినప్పుడల్లా మంత్రి పదవి ఇవ్వాలంటూ సీఎం ను,అధిష్టానాన్ని టార్గెట్ చేసే ఆ ఎమ్మెల్యే ఇప్పుడు నేరుగా సీఎం కుర్చీ పై కన్నేశారు.ఓ మెట్టు పైకెక్కి 'పులివెందులలో రాజశేఖర్ రెడ్డి ఎట్లనో మునుగోడులో రాజగోపాల్ రెడ్డి అట్లా...!! అంటూ తన నియోజకవర్గంలో స్పీచ్ లుమొదలు పెట్టారు.ఇది కేవలం ఉపమానం కాదు. మంత్రి పదవి ఇవ్వడం మాట ఇచ్చారు, మాట నిలబెట్టాలి, కపోతే నా టార్గెట్ మారదు. డైరెక్ట్ సీఎం చైర్ వైపే అంటూ అల్టిమేటం జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఎవరిని ఉద్దేశించి చేశారు!.నేరుగా సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ కే ఎసరు పెట్టారా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఓపెన్గానే నడుస్తోంది.ఒకవైపు రేవంత్ రెడ్డి అధికార సమతుల్యతలు కేబినెట్ బ్యాలెన్స్, సామాజిక సమీకరణలు, మరోవైపు రాజగోపాల్ రెడ్డి వ్యక్తిగత బలం, నియోజకవర్గంపై సంపూర్ణ పట్టు ఇతర అంశాల సంకేతాలు రాజగోపాల్ రెడ్డి మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తానికి, మునుగోడు నుంచి వచ్చిన ఈ గర్జన కాంగ్రెస్లో నిశ్శబ్దాన్ని చెదరగొట్టింది.ఇది లేక రేవంత్ vs రాజగోపాల్ రెడ్డి పవర్ పాలిటిక్స్ తో కొత్త అధ్యాయం మొదలవుతుందా?రాబోయే రోజుల్లో ఈ 'చేతి పట్టు'తుఫాన్ గా మారుతుందా?..మంత్రి పదవి తో ఆగుతుందా వేచి చూడాలి.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ విధానం

- ఇప్పటికైనా మారకపోతే భవిష్యత్ ఉండదు : ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 14:**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి 2020లో జరిగిన ఎన్నికల్లో ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా ఎక్స్ అఫిషియో ఓట్లతో గుట్ట చైర్మన్ పీఠాన్నిలాక్కున్నారని, ఆ రోజే బీఆర్ఎస్ నేతల పతనం ప్రారంభమైందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సీపీఐ,కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా కొనసాగుతున్నాయని, అందుకే అసెంబ్లీ, పార్లమెంట్, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన ప్రజలు, ఇతరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఓడిపోతామని తెలిసి కూడా ప్రగల్భాలు పలికిన గొంగిడి మహేందర్‌రెడ్డి ఇప్పుడు తల ఎక్కడ పెట్టుకుంటావ్ అని ప్రశ్నించారు.కర్మ ఎవరినీ వదిలిపెట్టదని, అక్రమంగా లాక్కున్న చైర్మన్ పీఠం నుండి బీఆర్ఎస్‌ను ప్రజలు ఒక్క స్థానానికి పడేశారని ఎద్దేవా చేశారు.
ఇప్పటికైనా మీ అహంకారపూరితమైన మాటలు మానుకోవాలని లేదంటూ రాజకీయంగా భూస్థాపితం తప్పదని హెచ్చరించారు.
గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని,ఇందుకు నిదర్శనమే మున్సిపల్ ఎన్నికలని అన్నారు. ప్రజాసేవకుడిగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, మున్సిపాలిటీల్లోనూ ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. నా బలం పది మంది నాయకులు కాదని,కార్యకర్తలే నా బలమని,ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని తెలిపారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. యాదగిరిగుట్టతో పాటు అన్ని మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరించి,అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. గతంలో సీపీఐ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో ప్రతి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నామని, వాటన్నింటినీ పరిష్కరించాలన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఎంతో మందికి ఉపాధి లేక హైదరాబాద్‌కు వెళ్తున్నారని ఉద్యోగవకాశాలు కల్పించాలని కోరారు. యాదగిరిగుట్ట పట్టణంలోని 33 వేల మంది ఇళ్లు లేకుండా ఉన్నారని,వారికి ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం కోసం సాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ,సీపీఐ జిల్లా సమితి సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ,పేరబోయిన మహేందర్,మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, ధర్మారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ కొల్లూరి రాజయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు శిఖ ఉపేందర్, నరసింహ, సలాం తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులను పరామర్శించిన

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 14 :**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో స్వల్ప మెజారిటీతో ఓడిన కౌన్సిలర్ అభ్యర్థులను తాళ్ల ప్రియ దర్శిని, గౌలికౌర్ అరుణ కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరామర్శించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పోటీ చేసి విజయం సాధించలేకపోయిన అభ్యర్థులను ఆయన వ్యక్తిగతంగా కలిసి ధైర్యం చెప్పారు. ప్రజాసేవలో గెలుపు, ఓటములు సహజమని,పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే మనసు ఉంటే ఓటమి మనలను ఆపలేదని,ప్రజల నమ్మకాన్ని తిరిగి గెలుచుకునే దిశగా ముందుకు సాగాలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేస్తే రాబోయే ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ,కాంగ్రెస్ నేతలు చీర శ్రీశైలం, శిఖ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరాయపల్లి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 14 :**

యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం పశుసంవర్ధక, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని గౌరాయపల్లి గ్రామ సర్పంచ్ కేశిరెడ్డి శోభరవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ బింగి లక్ష్మీపతి ప్రారంభించారు. వైద్య శిబిరంలో వైద్యులు ప్రగతి, భాస్కర్, శివరామకృష్ణ పాల్గొని ఉచిత వైద్యం అందించారు. మొత్తం 54 పశువులను పరిశీలించి గర్భకోశ నివారణ మందులు అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందులు, పశువులకు మినరల్ మిక్చర్ ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో వీఎల్‌వో శ్రీను, ఎల్ఎస్ఏ అశోక్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ గోపగాని భానుచందర్, గోపాలమిత్రలు అశోక్, రాములు, నర్సింహులు, బాలకిషన్, హర్ష, కరుణాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం

- యాదాద్రిలో వైభవంగా సాగుతున్న శివరాత్రోత్సవాలు



**జయభేరి, యాదగిరిగుట్ట :**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రామలింగేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో నిత్యహవనములు, శివపంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణములు, పంచసూక్త పఠనములు, మూలమంత్ర జపములు, వివిధ పారాయణములను పారాయణికులు గావించారు. అనంతరం రుద్రహవనమును యజ్ఞబ్రహ్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పారాయణికులు, పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం నమక, చమక పారాయణములు, మంత్రపుష్ప పఠనములు, సోమ కుంభాది అర్చనలు, మూతమంత్ర పారాయణములు నిర్వహించారు. రాత్రి శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

**ఘనంగా కల్యాణ మహోత్సవం..**

శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మాది దేవతలు,సప్త రుషి మండలము,ప్రమథ గణములు దర్శించి తరించే గొప్ప వేడుక పార్వతీ పరమేశ్వరుల కల్యాణమహోత్సవం, స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చి తిలకించి తరించారు. కల్యాణమహోత్సవంలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్,అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సవాల్లో నేడు..**

శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం జరగనుంది. మహాశివరాత్రి అభిషేకముల అనంతరం లింగోద్భవకాలమున మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు.



## పదవ వార్డు అభివృద్ధి కోసమే నామినేషన్ ఉపసంహరణ

- మూడు కోట్లు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- వార్డు అభివృద్ధి,రోడ్డు బాధితులకు 41 షాపుల కేటాయింపు హామీ ఇచ్చారు
- ప్రతి ఇంటింటికి వెళ్లి వివరణ ఇచ్చుకుంటానన్న బీఆర్ఎస్ నేత ఆవుల సాయి

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 14 :**

యాదగిరిగుట్ట పదవ వార్డు అభివృద్ధితో పాటు శ్రీ లక్ష్మి స్వామి వారి పాదాల నుంచి ఆర్యవైశ్య సత్రం వరకు రోడ్డు బాధితులకు పునర్ ఉపాధి కింద 41 షాపులు కేటాయిస్తామని పెద్దలు హామీ ఇచ్చిన మేరకు రాజకీయ ఒత్తిడికిలోనై మాత్రమే మున్సిపల్ ఎన్నికలలో నామినేషను ఆవుల మమతా సాయి ఉపసంహరించుకోవడం జరిగిందని...ఆమె భర్త, బీఆర్ఎస్ నేత ఆవుల సాయి స్పష్టం చేశారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత ఆయన మొట్టమొదటిసారి తన వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది ప్రస్తుతం వైరల్ మారింది.

**నిరూపిస్తే దేనికైనా సిద్ధం..**

మూడు కోట్ల రూపాయలు పుచ్చుకొని నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు వచ్చిన ఆరోపణలను ఆవుల సాయి ఖండించారు. ఆ విషయం నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఒకవైపు తన కుటుంబ పరిస్థితి..మరోవైపు అభివృద్ధిపై పెద్దల హామీ వల్ల మాత్రమే తాము తప్పుకున్నట్లు తెలిపారు.

**పదో వార్డు ప్రజల ఆదరణ మరువలేనిది**

తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన పదో వార్డు ప్రజల ఆదరణ,ఆశీర్వాదం మరువలేనిదని బిఆర్ఎస్ నేత ఆవుల సాయి అన్నారు. పదో వార్డు ప్రజల ఆదరాభిమానాలతో గత ఏడు సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్నానని వివరించారు. తాను,తన వ్యక్తిత్వం ఏమిటో పదో వార్డు ప్రజలకు తనకంటే వారికి ఎక్కువ తెలుసునని తెలిపారు.

**ప్రతి ఇంటింటికి వివరణ**

పదవ వార్డులోని ప్రతి ఇంటింటికి వెళ్లి తన నామినేషన్ ఉపసంహరణ పై వివరణ ఇచ్చుకుంటానని... క్షమించమని వేడుకుంటానని ఆవుల సాయి తన వీడియో పోస్టులో తెలిపారు. ఒక బిడ్డగా ఒక సోదరునిగా భావించి పదో వార్డు ప్రజలు తనను క్షమించాలని విచారణ వదనంతో ఆవుల సాయి ఇచ్చుకున్న వివరణ ఆయన అభిమానులను కళ్ల నీళ్ల పర్యంతం చేస్తోంది.

## నూతన సర్పంచులకు సన్మానోత్సవం



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 14 :**

తుర్కపల్లి మండలంలో నూతనంగా గెలిచిన సర్పంచుల ఈసీఐఎల్ లోని కోరల్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞాపకతో పాటు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండలానికి అతి చేరువలో ఉన్న ఈసీఐఎల్ లోని 50 పడకల మహిళలు, పిల్లల కు అన్ని రకాల వైద్య సేవలు అందించే కోరన్ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి సర్పంచ్ సోమల వెంకటేశం, తిరుమలాపురం సర్పంచ్ డొంకెన రేణుక వెంకటేష్‌యాదవ్, మోతీరామ్ తండా సర్పంచ్ ధరావత్ కమిలి, పెద్ద తండా బనావత్ విజయ, చౌక్లా తండా భూక్య రాజారాం నాయక్, రుస్తాపూర్ సర్పంచ్ పడమటి సంతోష్ రెడ్డి, రాంపూర్ తండా సర్పంచ్ గుగులోతు బద్దు నాయక్, జైతురామ్ తండా సంతోష్ నాయక్, ములకలపల్లి సర్పంచ్ బానోతు బుల్లి వీరన్న, కొండాపూర్ సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్ పాల్గొన్నారు.

# సర్వసమానత్వ పరిపాలన జరగాలంటే ప్రజలు బిఎస్పీకి అధికారం ఇవ్వాలి

**జయభేరి, చర్ల, ఫిబ్రవరి 14 :**




చర్ల మండలం కేంద్రంలోని బిఎస్పి చర్ల మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు పాయల మోహన్ రావు అధ్యక్షతన మండలంలోని సెక్టార్ల సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి గుర్రాల దుర్గా భవాని హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం చర్ల మండలంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని అధికారంలో ఉన్నప్పటికీ ఎందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు నాడు ఎన్నికల సమయంలో చర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామని, వద్ది పేట చెక్కు డ్యామ్ నీ నిర్మిస్తామని, వరద బాధితులకు మేరక ప్రాంతంలో ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని , మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నో ప్రగల్ బాలు పలికారు కానీ ఇప్పటివరకు ఈ ప్రాంత అభివృద్ధి ఇచ్చిన హామీలలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఒక్కటి కూడా చేసినటువంటి పరిస్థితి లేదు కాంగ్రెస్ పార్టీకి గాని టిఆర్ఎస్ పార్టీకి గాని భద్రాచలం నియోజకవర్గం ప్రాంతాన్ని ప్రజలను అభివృద్ధి చేసి ఆలోచన ఏమాత్రం లేదని విమర్శించారు ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు, కొండా చరణ్,నియోజకవర్గ అసెంబ్లీ ఉపాధ్యక్షులు పడగల వెంకట్ , అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్, పార్టీ దుమ్ముగూడం మాజీ మండల అధ్యక్షులు కొండా ప్రమోద్, దుమ్ముగూడెం మండలం ప్రధాన కార్యదర్శి జక్కా వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం మండల కార్యదర్శి కొప్పుల జయసింహ, చర్ల మండల ఉపాధ్యక్షులు ఎస్కే జహీరుద్దీన్ భాష ,చర్ల మండల ప్రధాన కార్యదర్శి చాప భాస్కర్, పార్టీ మండల కోశాధికారి పంబి కుమారి పార్టీ మండల ఈసీ మెంబర్ చిట్టిమల్ల సుజాత, సెక్టార్ నాయకులు సోయం శ్రీమూర్తులు ఉప్పరగూడెం ఉపసర్పంచ్ సోయం మంగతాయి, ఉప్పరగూడెం పంచాయతీ వార్డు మెంబర్ పాయల ప్రమీల, పార్టీ నాయకులు వెంకటలక్ష్మి, కాక నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.


## తొందర్లోనే పనులు ప్రారంభం

- ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ కొరకు 30 కోట్ల రూపాయలు మంజూరు చేయించినందుకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి నాచారం డివిజన్ పుర ప్రముఖులు మరియు హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ సభ్యులు BRS నాయకులు కార్యకర్తలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొందర్లోనే చెరువులో ఉన్న నీటిని మొత్తం బయటికి పంపించి పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. రాబోయే రోజుల్లో నాచారంలో దోమల సమస్యకు పూర్తిగా నిర్మూలించనున్నట్లు తెలియజేశారు. అలాగే పటేల్ కుంట చెరువులు కూడా ఖాళీ చేసి కూడిక తీత పనులు తొందరలోనే ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ భూపాల్ రెడ్డి ఎర్రం శ్రీనివాస్ రెడ్డి చంద్రశేఖర్ జయరాజ్ రామ్ కోటేశ్వరరావు యాదగిరిరెడ్డి కిషన్ సుభాస్కర్ బాల్రెడ్డి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 14 :**

తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన బునారి వెంకటేశం ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి బొత్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు 2500 రూపాయలు, గ్రామానికి చెందిన పెద్దగొల్ల కిష్టయ్య 2500 రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కుక్కుట్ల ఇస్తారి, ఏలగల వెంకటేశ్వర్లు, సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షుడు కలకుంట్ల సత్యనారాయణ, సాగర్ల బిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

- 50,000/- రూపాయల విరాళాన్ని కాలనీ అధ్యక్షుడుకి అందజేసిన కొత్త స్రవంతి కిషోర్ గౌడ్

**జయభేరి, మేడిపల్లి :**



జిహెచ్ఎంసి బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ద్వారకా నగర్ ఫేస్ 2 కాలనీలో నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ 50,000/రూపాయల విరాళాన్ని కాలనీ అధ్యక్షుడు రాజు గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ చారి లకు అందజేశారు. ఈ సందర్భంగా కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం ద్వారకా నగర్ ఫేస్ 2 కాలనీవాసుల కృషి అభినందనీయమని, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయనిర్మానంలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందని ఆంజనేయ స్వామి ఆశీస్సులు బోడుప్పల్ ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్లు కొత్త కిషోర్ గౌడ్ తెలిపారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు కొత్త కిషోర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, మాజీ కోఆప్షన్ బ్రాహ్మణ గౌడ్, సీనియర్ నాయకులు కుర్రి శివశంకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## గద్దెగూడెంలో శివుడి మహోత్సవాలు ప్రారంభం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం గద్దె గూడెంలో శనివారం రాత్రి శివుడి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ప్రతి ఏడాది స్థానిక శివాలయంలో శివుడి మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా స్వామివారి ఉత్సవాలకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శివుడి సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివుడి మహోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించానున్నారు. దీనికిగాను దేవాలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని శివాలయాన్ని రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయ మానంగా అలంకరించారు. రథోత్సవం పురస్కరించుకొని స్వామివారి రథానికి రంగులు వేసే ముస్తాబు చేస్తున్నారు.


## విజ్ఞాన, విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు




జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 14 :

తుర్కపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని యుపిఎస్ పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ చదువులతో పాటు విహారయాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పాఠ్యాంశాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. హైదరాబాదు నగరంలోని ప్రముఖ విజ్ఞాన క్షేత్రాలను సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## నేడు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 14 :

నేడు తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ మహాశివరాత్రి పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 5:30 నిమిషాలకు స్వామివారికి అభిషేకాలు, రాత్రి 9:45 నిమిషాలకు శివపార్వతుల కళ్యాణం, రాత్రి 11:30 నిమిషాలకు శివపార్వతుల పల్లకి సేవ, రాత్రి లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వీరభద్రుని పూజ, కాలభైరవ స్వామి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు స్వామివారి కళ్యాణం అభిషేకాల్లో సాంప్రదాయ దుస్తులను ధరించి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షకి ప్రకటన విడుదల




జయభేరి, పరవాడ:

అనకాపల్లి పట్టణంలో గల మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో 40 స్థానాలకు నేరుగా ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ప్రకటన వెలువడిందని పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జోష్యుల ఉష తెలియజేశారు. అలాగే 6వ తరగతిలో 12 ఖాళీ స్థానాలకు కూడా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.తేదీ 04022026 నుండి తేదీ: 04032026 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని 5వ తరగతిలో ప్రవేశానికి తేదీ:1242026 న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, 6వ తరగతిలో ఖాళీ స్థానాలకు తేదీ:1942026 న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల మరియు అర్హత గల బాలుర తల్లిదండ్రులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలతో విద్యా బోధన జరుగుతుందని తెలిపారు పూర్తి వివరాలకు ఈ 9030375530 నెంబర్కి సంప్రదించాలని తెలిపారు.

# కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే అన్న బండి సంజయ్



జయభేరి, కరీంనగర్, ఫిబ్రవరి 14

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ మూడు పార్టీలకు ప్రేమికుల రోజు శుభాకాంక్షలు అని వ్యంగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ... మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని... ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు. కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే... కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని సంజయ్ తెలిపారు. అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్ కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంట నక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు.
మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా... బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.

**బండి సంజయ్ అర్జునుడే....**

బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు ఫిట్ అవుతారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో ఏమీ లేరని వ్యాఖ్యానించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, ఇప్పుడు కార్పొరేటర్లను ఎత్తుకెళితే మరింత ఛీకొడతారని అన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నామని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లను గెలుచుకున్నామని ధర్మపురి అరవింద్ వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీ అని దుయ్యబట్టారు.ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించినందుకు నేనే వారిపై కేసు పెట్టాలని ఆయన అన్నారు. కానీ పోలీసులే తనపై కేసు పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు చెప్పారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు.రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం ముఖ్యమని అన్నారు. ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్లు నిర్ణయించుకుంటారని తెలిపారు. కానీ బలవంతంగా ఎత్తుకెళ్లడం సరికాదని అన్నారు. కరీంనగర్‌లోను బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.



## రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పెట్టుబడుదారుల బడ్జెట్

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి

జయభేరి, పరవాడ:

నేడు రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ అనకాపల్లి జిల్లా ప్రజలను, నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఉత్తరాంధ్ర పారిశ్రామిక హబ్‌గా పేరు గాంచిన అనకాపల్లి జిల్లాకు ఈ బడ్జెట్ లో మొండిచేయి చూపడం అత్యంత విచారకరం. ఈ బడ్జెట్లో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కి ఊసే లేదు. తాడి గ్రామం, మూల స్వయంవరం గ్రామాలు తరలించడానికి ఈ బడ్జెట్ లో నిధులు కేటాయింపు చేయకపోవడం విచారకరం. గ్రామాల తరలింపుకు నిధులు కేటాయిస్తారని కొండంత ఆశతో చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. పర్యావరణానికి నష్టం కలిగించి, కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అనకాపల్లి పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని గని శెట్టి హెచ్చరించారు.

## కాంగ్రెస్ లో కలిసిన దేవరకద్ర బిఆర్ఎస్ కౌన్సిలర్




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ కౌన్సిలర్ యుగేందర్ రెడ్డి శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో స్థానిక మున్సిపాలిటీ 12వ బీ ఆర్ యస్ కౌన్సిలర్ గా యుగేందర్ రెడ్డి విజయం సాధించారు. పార్టీలో కలిసిన యుగంధర్ రెడ్డిని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.

# అగ్నికి ఆహుతి అయ్యిన హరివీర్ సిల్క్ బట్టల దుకాణం

- అగ్ని ప్రమాదంలో 10 లక్షల ఆస్తి నష్టం



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో అంబికా సెల్ పాయింట్ ఫణింద్ర సెల్ షాపు కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అగ్ని ప్రమాదానికి గురైన సెల్ షాప్ పక్కనే ఉన్న బండారు త్రినాధరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న గెడ్డం నూకరాజు నిర్వహిస్తున్న హరివీర్ సిల్క్ దుకాణంలో మంటలు అదికంగా వ్యాపించడంతో సిల్క్ బట్టల దుకాణం పూర్తిగా దగ్ధమైంది. చుట్టు పక్కల ఉన్న స్థానికులు మొదట మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎన్టిపిసి అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే దుకాణంలోని విలువైన సిల్క్ బట్టలు, ఫర్నిచర్ తదితర సామగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు షాపు యజమాని గెడ్డం నూకరాజు తెలిపారు. జరిగిన నష్టంతో ఆయన కన్నీరు మున్నీరుగా ఆవేదన వ్యక్తం చేశారు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీ సభను జయప్రదం చేయాలి

- సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఈనెల 16వ తేదీన జరగబోయే బీసీ సభను జయప్రదం చేయాలి సామాజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ దేవరకొండ నియోజకవర్గం లో జాతీయ బీసీసంక్షేమ సంఘం సమావేశం ఏర్పాటు చేయడమైనది సోమవారం సాయి రమ్య ఫంక్షన్ హాల్ దేవరకొండ పట్టణంలో జరగబోయేటువంటి జాతీయ బీసీ సంక్షేమ సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.
ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ,రాజ్య సభ సభ్యులు,జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య , స్థానిక శాసనసభ్యులు నేనా బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్గా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని నూతనముగా ఎన్నిక అయినటువంటి సర్పంచులు ఉపసర్పంచుల కు సన్మానం , వ్యాసరచన పోటీలలో విజేతలైనటువంటి విద్యార్థులకు సన్మాన కార్యక్రమం కలదు. ఈ కార్యక్రమానికి అందరూ పార్టీలకు అతీతంగా అన్ని కుల సంఘాలు విధిగా హాజరువై ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అందరూ పాల్గొనడం జరిగింది.

## దేవరకద్రలో ఘనంగా వాసవి మాత పల్లకి సేవ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి వాసవి మాతా పల్లకి సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమల హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఉదయం 8:30 గంటలకు అమ్మవారికి అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారి శ్రీ చక్రాలకు కుంకుమార్చన కార్యక్రమాన్ని,లలితా సహస్రనామ పారాయణం,అమ్మవారికి మహా మంగళ హారతి నిర్వహించారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షు కల్వ కన్నయ్య శెట్టి,జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి,జిల్లా విశ్వహిందూ పరిషత్ మాజీ అధ్యక్షులు గుద్దేటి చంద్రయ్య, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొరియన్ లవ్ గేమ్... ఢిల్లీలోనే 800 మంది మిస్సింగ్




**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 :**

ధ్రువ సినిమా చూశారా.. అందులో రామ్ చరణ్ శరీరంలో ఒక బగ్ ఉంటుంది. దాని ద్వారా అరవింద్ స్వామి రామ్ చరణ్ మాట్లాడిన మాటలు మొత్తం వింటూ ఉంటాడు. అతడు చేసే పనులకు కౌంటర్ ఇస్తూ ఉంటాడు. రామ్ చరణ్ ను చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాడు. అటువంటి బగ్ మన శరీరంలో ఒకటి ఉంటే.. అది కూడా ఒక ఫోన్ రూపంలో ఉంటే.. ఎలా ఉంటుంది.. చదువుతుంటే ఆందోళన కలుగుతుంది కదూ.. మనదేశంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ నగరంలో ముగ్గురు సోదరీమణులు ఒకరి వెంట ఒకరు బలవంతంగా చనిపోయారు. దీని వెనుక భయంకరమైన కారణాలు ఉన్నాయి.రియన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. కొరియన్ డ్రామాలు బాగుంటాయి. కొరియన్ సినిమాలలో నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు కొరియన్ సినిమాల్లో డ్రామా.. ఉత్కంఠ.. ముని వేళ్ళ మీద నిలబెట్టే ఉద్వేగం ఇలా చాలా ఉంటాయి. అందువల్లే చాలామంది కొరియన్ సినిమాలను ఇష్టపడుతుంటారు. ప్రపంచానికి భిన్నంగా.. ఆలోచించడం కొరియన్ ప్రజలకు ఇష్టం. టెక్నాలజీతో వారు ఒక ఆట ఆడుకుంటారు. అయితే ఇతరుల భావోద్వేగాలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం చాలా మంది కొరియన్ ప్రజలకు అలవాటు. దాన్ని ఒక ఆనందంగా వారు భావిస్తుంటారు. ప్రపంచం మొత్తం తమ చేతిలో ఉంది అని అనుకుంటారు. అందువల్లే కొరియన్ నిపుణులు కొంతమంది గేమ్స్ రూపొందించారు. ఈ గేమ్స్ కు సంబంధించిన ఏ వ్యవహారం కూడా అధికారికంగా బయటికి కనిపించదు. తయారీదారులు కూడా వారి వివరాలు బయటపెట్టరు. రకరకాల మాధ్యమాలలో తమ గేమ్స్ గురించి ప్రమోషన్ చేసుకుంటారు. ముఖ్యంగా యుక్త వయసు పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని ఏదో ఒక రూపంలో వారికి దగ్గరవుతారు. "నువ్వు స్మార్ట్ గా ఆలోచిస్తున్నావ్. నీ కళ్ళల్లో స్పార్క్ కనిపిస్తోంది. మీ అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే నువ్వు ఉంటావా.. ఈ కొరియన్ పేరు ట్రై చెయ్.. అసలు నువ్వు స్కూల్ కి ఎందుకు వెళ్లాలి.. ఈరోజు కాలేజీకి ఎందుకు బంక్ కొట్టకూడదు.. నువ్వు ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు.. ఈ నాలుగు గోడల మధ్యలోనే నువ్వు స్వేచ్ఛను ఎందుకు కోరుకోకూడదు.. కొత్త కొత్త టాస్క్ లు చేసేయ్. నీకు ప్రతిదీ ఉద్వేగంగా ఉంటుంది. చదువుకుంటే మహా అయితే ఉద్యోగం మాత్రమే చేస్తావు. ఒక కింద బానిసలాగా పనిచేయడం నీకు అవసరమా" ఇలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతుంటారు.టీనేజ్ పిల్లలలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో కొరియన్ గేమ్స్ నిర్వాహకులు యూత్ పిల్లలను రెచ్చగొడుతుంటారు. ఒకరకంగా వారిని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ప్రతిరోజు ఒక టాస్క్ ఇస్తూ ఉంటారు. ఆ టాస్క్ పూర్తి చేసిన తర్వాత నువ్వు ప్రపంచంలోనే ధీరుడువి.. నీలాంటి శక్తివంతుడు ఎవరూ లేరు.. ఈ ప్రపంచంతో నీకే సంబంధం.. నీకై నువ్వు ఒంటరిగా వచ్చావు కదా.. ఒంటరిగా వెళ్తే తప్పేంటి అన్నట్టుగా యువతలో లేనిపోని ఉద్వేగాలను నూరిపోస్తుంటారు.ఆ తర్వాత వారిని తమ ఆధీనంలోకి పూర్తిగా తీసుకున్న తర్వాత.. ఈ ప్రపంచం తో నీకు సంబంధం లేదు.. నువ్విక వెళ్ళిపోవచ్చు.. ఈ టాస్క్ లో కనుక నువ్వు చనిపోతే విజేతవు.. అంటూ ఒక రకమైన ఉద్వేగాన్ని రుద్దుతారు. ఫలితంగా ఇదంతా నిజమే అని భ్రమపడి పిల్లలు.. కొరియన్ గేమ్స్ నిర్వాహకులు చెప్పినట్టుగా చేస్తుంటారు. చివరికి వారు తన ప్రాణాలను కూడా కోల్పోతుంటారఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నగరంలో జరిగింది పైతరహా దారుణమే. అయితే ఇప్పటికీ ఈ విషయంలో ఇంకా కొన్ని తెలియని నిజాలు బయటికి రావాల్సి ఉంది. ఈ ఘటనలో ఆ ముగ్గురు పిల్లల తండ్రి చెబుతున్న మాటలు పొంతన లేకుండా ఉన్నాయి. ఇంకా దర్యాప్తు సాగుతుంది కాబట్టి ఈ వ్యవహారంలో కొన్ని విషయాలను బయటకు చెప్పడం సాధ్యం కావడం లేదు.ఘజియాబాద్ ఘటన తర్వాత కొరియన్ గేమ్స్ పై చర్చ మొదలైంది. ముఖ్యంగా బ్లూ వేల్ గేమ్ ను బ్యాన్ చేయాలని డిమాండ్ కూడా వ్యక్తం అవుతుంది. వేల్స్ లో బ్లూ వేల్స్ కొన్ని సందర్భాలలో ఒంటరిగా ఉంటాయి. ఆ తర్వాత ఎవరికి చెప్పకుండా తమను తాము బలవంతంగా చంపేసుకుంటాయి. కొరియన్ గేమ్ నిర్వాహకులు కూడా తమ రూపొందించిన ఆటకు బ్లూవేల్ గేమ్ అని పేరు పెట్టారు. అందులో బ్లూ వేల్ మాదిరిగానే చనిపోవాలని టాస్క్ ఇస్తుంటారు.. ఇది పిల్లల మెదడు పైన ఒక రకమైన ప్రభావాన్ని చూపుతుంది. తమకు తెలియకుండా తామే ఆత్మహత్య చేసుకునే విధంగా పురిగొల్పుతుంది. ఘజియాబాద్ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో దాదాపు 800 మంది దాకా యువతీ యువకులు మిస్సింగ్ అయ్యారని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో దేశవ్యాప్తంగా కలకలం నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఘజియాబాద్ ఘటన విషయంలో ఉత్తర ప్రదేశ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. ఢిల్లీలో 800 మంది యువతీ యువకులు మిస్సింగ్ అవ్వలేదని.. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిలోకి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏది ఏమైనప్పటికీ తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు ఫోన్లలో ఏం చేస్తున్నారో..ఏం చూస్తున్నారో కనిపెట్టుకొని ఉండాలి.

# రామేశ్వరంలో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాట్లు

- 100 మంది పోలీసులతో పటిష్టంగా భారీ బందోబస్తుతో నిఘా
- షాద్ నగర్ డీసీపీ శిరీష
- ఎసిపి లక్ష్మీనారాయణ,సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 14 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ రామ లింగేశ్వర స్వామి రామేశ్వరం దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు షాద్ నగర్ డీసీపీ శిరీష తెలిపారు..మహా శివరాత్రి సందర్భంగా శనివారం షాద్ నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ..... మహాశివరాత్రికి వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు రామేశ్వరం రామలింగేశ్వర స్వామి దర్శనానికి తరలి వస్తారని,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనానికి ముమ్మర ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్ కుమార్, ఎస్సై ప్రణయ్, శివారెడ్డి, ఏసైలు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- ఇన్స్పెక్టర్ మేడిపల్లి గోవింద రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్ గిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు సంబంధించి పోలీస్ సిబ్బంది శనివారం నా బోడుప్పల్ ఇందిరానగర్ ఏరియాలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి దగ్గర ఒక బ్యాగ్ లభ్యమయింది. బ్యాగును పరిశీలించి చూడగా అందులో గంజాయి (Narcotic Drug) దొరికింది. వెంటనే అట్టి వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా వారి పేర్లు.. 1. అదెల తేజ S/0 నరసింహ(33), R/0 పర్వతాపూర్ మేడిపల్లి. 2. మండోలం రుద్ర సాయి (27), S/0 పకీరప్ప, R/0 : పీర్జాదిగూడ, 3. దామరోళ్ల భాస్కర్(19), S/0 రాజిరెడ్డి, R/0: ఇందిరా నగర్ బోడుప్పల్. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి దగ్గర గంజాయి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనపరచుకొని.. చట్ట ప్రకారం Cr.no :220/26 U/Sec 8(c) r/w20(b)(ii)(A) NDPS Act 1985 కేసు నమోదు చేసి పైన తెలిపిన ముగ్గురు వ్యక్తులను రిమాండ్కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మేడిపల్లి గోవింద రెడ్డి యువతను హెచ్చరిస్తూ సూచనలు చేస్తూ మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, ఇందుకు కారణమవుతున్న గంజాయి, డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాలు లేకుండా చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురి కాకుండా చూడాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని Dial 100 ద్వారా పోలీస్ వారికి ఇవ్వాలని ఆయన కోరారు.



# పుల్వామా అమరవీరులకు ఉప్పల్ రింగ్ రోడ్డులో ఘన నివాళులు

- ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ రింగ్ రోడ్డులో పుల్వామా దాడిలో అమరులైన భారత సైనికులకు ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆధ్వర్యంలో, పెద్ద సంఖ్యలో యువత పాల్గొని దేశభక్తి భావాలతో సాగింది. కార్యక్రమంలో భాగంగా అమరవీరుల చిత్రాలకు కొవ్వొత్తులు వెలిగించి, పూల వర్షం కురిపిస్తూ నివాళులు అర్పించారు. అనంతరం "అమర జవాన్లకు జై", "భారత్ మాతాకి జై" వంటి దేశభక్తి నినాదాలతో పరిసర ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగాలు ఎన్నటికీ మరచిపోలేనివి. వారి త్యాగాలే నేటి మన స్వేచ్ఛకు పునాది. యువత దేశభక్తిని అలవర్చుకొని, దేశ ఐక్యత కోసం కృషి చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమం యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలన్న సందేశాన్ని ఈ నివాళుల కార్యక్రమం స్పష్టంగా తెలియజేసింది.






# వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తి ల ర్యాలీ

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ వాసవి క్లబ్ , వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో వీరమరణం పొందిన వీర సైనికులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి కొవ్వొత్తి ర్యాలీ వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్, ఆర్యవైశ్య సంగం సభ్యులు,ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, వాసవి కళ్యాణ మండపం సభ్యులు, స్వర్ణరథ కమిటీ సభ్యులు, వామ్ సభ్యులు,ఆవోపా సభ్యులు వాసవి సేవా సదన్ సభ్యులు, మహిళా విభాగ సభ్యులు అందరూ పాల్గొని వీరమరణం పొందిన జవాన్ల కోసం ర్యాలీ నిర్వహించి ఐదు నిమిషాల మౌనం పాటించినారు.

# ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

- తపోవన్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం డోకూరు గ్రామ సమీపంలో గల తపోవన్ ఉన్నత ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ పాత్రలకు న్యాయం చేశారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మహబూబ్ నగర్ మేనేజ్మెంట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మల్లేష్, దేవరకద్ర, చిన్నచింతకుంట, మరికల్, మహబూబ్ నగర్ పట్టణాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ధర్మ జాగరణ ప్రముఖ్ లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి, ట్రస్మా స్టేట్ సెక్రటరీ కొండా శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర పిఎసిఎస్ ఛైర్మెన్ నరేందర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రయ్య, నర్సింహులు , రవి, శ్రీనివాసులు, ఇక్బాల్ పాష, తిరుపతయ్య, కురుమూర్తి, నాగరాజు, అనురాధ, ఉమ, సబీహా, పావని, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, భార్గవి లతోపాటు ఆయా తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ వార్డు సభ్యుడ్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం కావేరమ్మపేట మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ రెడ్డిని శనివారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పరామర్శించారు. భాస్కర్ రెడ్డికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో జిల్లా కేంద్రంలోని నేహా షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్ ఆసుపత్రికి వెళ్లి భాస్కర్ రెడ్డిని పరామర్శించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. భాస్కర్ రెడ్డి కి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కోరారు.

# దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం రైతులు 17 క్వింటాళ్ల కందులను విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ.7579 రూపాయల ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ. 7219 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

# దశ దినకర్మలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలం యురోనిపల్లిలో హన్వాడ వెంకటయ్య తండ్రి శావుకుల జగన్నాథం దశదిన కార్యక్రమంలో శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే ఎర్ర శేకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పుష్పాంజలి ఘటించారు.

మహా శివరాత్రి గురించి స్కాంద పురాణం, లింగ పురాణం, పద్మ పురాణాలతో సహా అనేక పురాణాలలో ప్రస్తావించబడింది. ఈ మధ్యయుగపు శైవ గ్రంథాలు ఈ పండుగను వివిధ రకాలుగా వర్ణించాయి. వీటిలో ఉపవాసం, శివుని చిహ్నంగా భావించే శివలింగానికి పూజలు చేయడం వంటివి ఉన్నాయి. వివిధ పురాణాలు మహా శివరాత్రి యొక్క ప్రాముఖ్యతను వివరిస్తాయి. శైవ సంప్రదాయంలో ఒక పురాణం ప్రకారం, సృష్టి, స్థితి, లయ కారకుడైన శివుడు తాండవం చేసే రాత్రి ఇది. స్తోత్రాలు, శైవ గ్రంథాల పఠనం, భక్తుల హోరు ఈ విశ్వ నృత్యంలో చేరి, ప్రతిచోటా శివుని ఉనికిని గుర్తు చేస్తుంది. మరొక పురాణం ప్రకారం, ఇది శివుడు మరియు పార్వతి వివాహం చేసుకున్న రాత్రి. వేరొక పురాణం ప్రకారం శివరాత్రి అనేది సంవత్సరానికొకసారి శివలింగాన్ని పూజించడం, గతంలో చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి, పుణ్యమార్గంలో జీవించి కైలాసాన్ని చేరుకోవడం. క్షీరసాగర మథన సమయంలో ఉద్భవించిన హాలాహలాన్నుంచి ప్రపంచాన్ని కాపాడటం కోసం శివుడు దాన్ని సేవించి కంఠంలో దాచుకుని నీలకంఠుడనే పేరు పొందిన రాత్రి ఇది. ఈ పండుగరోజు జరిగే నృత్య సంప్రదాయానికి చారిత్రక మూలాలు ఉన్నాయి. కోణార్క్, ఖజురహో, పట్టడకల్, మోధేరా, చిదంబరం వంటి ప్రధాన హిందూ దేవాలయాలలో వార్షిక నృత్య ఉత్సవాలకు మహా శివరాత్రి చారిత్రాత్మకమైన సమ్మేళనంగా పనిచేసింది. ప్రదర్శిత కళల గురించి నాట్యశాస్త్రం అనే పురాతన గ్రంథంలో పేర్కొన్న అనేక ముద్రలు శిల్పాల రూపంలో చెక్కబడిన చిదంబరం ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నాట్యాంజలి అని పిలుస్తారు. ఖజురహో శివాలయాలలో, మహా శివరాత్రి నాడు జరిగే ఒక ప్రధాన నృత్యోత్సవం, ఆలయ సముదాయం చుట్టూ మైళ్ల దూరం విడిది చేసిన శైవ యాత్రికులు, 1864లో అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ గ్రంథస్తం చేశాడు.

### ప్రళయ (ప్రళయం)

మహా ప్రళయ కాలంలో సర్వ లోకాలు సముద్ర నీరుతో నిండి ఉన్నప్పుడు పార్వతి దేవి మహా ప్రళయ అనంతరం మళ్ళీ జీవులని, జీవ శక్తిని పెపొందించే నిమిత్తం తన భర్త శివుడు ప్రార్థించారు అని మరో కథనం. శివుడి ద్వారా తీసుకురాబడిన ప్రళయం నుండి జీవాలను (నివసిస్తున్న ఆత్మలు) రక్షించేందుకు బంగారం దుమ్ము విత్తనం వంటి కణాలులో మైనపు ముద్దలతో ఉండిపోయేవిధంగా పార్వతి దేవత ప్రార్థించారు.

### వివాహం

దేవత పార్వతి, శివుడు వివాహం రోజు శివరాత్రిగా కూడా ఉంది.

### శివుడు ఇష్టమైన రోజు

భూమి యొక్క సృష్టి పూర్తి అయిన తరువాత, భక్తులు, ఆచారాలు పాటించేవారు, పార్వతి దేవి కృతజ్ఞతలుతో ఆయన సంతోష పెట్టేందుకు శివుడును కోరారు. అందుకు శివుడు జవాబుగా, అమావాస్య 14 రాత్రి, ఫాల్గున నెలలో కృష్ణ పక్షంలో, తన అభిమాన రోజు అని బదులిచ్చాడు. పార్వతి, ఆమె స్నేహితులకు ఈ పదాలు పునరావృతం చేసింది. వీరిలో నుండి ఆ పదం సృష్టి అంతా వ్యాపించింది. మహాశివ రాత్రి మహాత్మ్యవృత్తాంతం శివ పురాణములోని విద్యేశ్వర సంహితలో చెప్పబడింది. గంగా యమునా సంగమ స్థానమైన ప్రయాగలో (నేటి అలహాబాదు) ఋషులు సత్ర యాగం చేస్తున్నసమయంలో రోమర్షణమహర్షి అని పేరు గాంచిన సూతమహర్షి అక్కడకు వస్తాడు. ఆలా వచ్చిన సూతమహర్షికి అ ఋషులు నమస్కరించి సర్వోత్తమమైన ఇతిహాస వృత్తాంతాన్ని చెప్పమనగా అతను తన గురువైన వేదవ్యాసుడు తనకు చెప్పిన గాథను వివరించడం ప్రారంభిస్తాడు. ఒకసారి పరాశర కుమారుడైన వ్యాస మహర్షి సరస్వతి నదీ తీరమున ధ్యానం చేస్తుంటాడు. ఆ సమయంలో సూర్యుని వలె ప్రకాశించే విమానంలో సనత్కుమారుడు వెళ్ళుతుంటాడు. దానిని గమనించిన వ్యాసుడు బ్రహ్మ కుమారుడైన సనత్కుమారునకు నమస్కరించి ముక్తిని ప్రసాదించే గాథను తెలుపుమంటాడు. అప్పుడు మందర పర్వతం మీద బ్రహ్మ కుమారుడైన సనత్ కుమారుడు తనకు, నందికేశ్వరునికి మధ్య జరిగిన సంవాదాన్ని వ్యాసునికి చెప్పగా, వ్యాసుడు సూతునికి చెప్పిన వృత్తాంతాన్ని సత్రయాగంలో ఋషులకు చెబుతాడు. సనత్కుమారుడు నందికేశ్వరుడిని శివుని సాకారమైన మూర్తిగా, నిరాకారుడైన లింగంగా పూజించడానికి సంబంధించిన వృత్తాంతాన్ని చెప్పమంటాడు. దానికి సమాధానంగా నందికేశ్వరుడు ఈ వృత్తాంతాన్ని చెబుతాడు.

### బ్రహ్మ, విష్ణువుల యుద్ధం

విద్యుద్దీపపు కాంతుల్లో నటరాజ స్వరూపుడైన పరమశివుడు ఒకప్పుడు ప్రళయ కాలం సంప్రాప్తము కాగా మహాత్ములగు బ్రహ్మ, విష్ణువులు ఒకరితో ఒకరు యుద్ధానికి దిగారు. ఆ సమయంలోనే మహాదేవుడు లింగరూపంగా ఆవిర్భవించాడు. దాని వివరాలు ఇలాఉన్నాయి. ఒకప్పుడు బ్రహ్మ అనుకోకుండా వైకుంఠానికి వెళ్ళి, శేష శయ్యపై నిద్రిస్తున్న విష్ణువును చూసి, "నీవెవరవు, నన్ను చూసి గర్వముతో శయ్యపై పడుకున్నావులే, నీ ప్రభువును వచ్చి ఉన్నాను నన్ను చూడు. ఆరాధనీయుడైన గురువు వచ్చినప్పుడు గర్వించిన మూఢుడికి ప్రాయశ్చిత్తం విధించబడుతుంది " అని అంటాడు. ఆ మాటలు విన్న విష్ణువు బ్రహ్మను ఆహ్వానించి, ఆసనం ఇచ్చి, "నీచూపులు ప్రసన్నంగా లేవేమి?" అంటాడు. దానికి సమాధానంగా బ్రహ్మ "నేను కాలముతో సమానమైన వేగం తో వచ్చాను. పితామహుడను. జగత్తును, నిన్ను కూడా రక్షించేవాడను" అంటాడు. అప్పుడు విష్ణువు బ్రహ్మతో "జగత్తు నాలో ఉంది. నీవు చోరుని వలె ఉన్నావు. నీవే నా నాభిలోని పద్మమునుండి జన్మించినావు. కావున నీవు నా పుత్రుడవు. నీవు వ్యర్థముగా మాట్లాడుతున్నావు" అంటాడు. ఈ విధంగా బ్రహ్మ విష్ణువు ఒకరితోనొకరు సంవాదములోనికి దిగి, చివరికి యుద్ధసన్నద్ధులౌతారు. బ్రహ్మ హంస వాహనం పైన, విష్ణువు గరుడ వాహనం పైన ఉండి యుద్ధాన్ని ఆరంభిస్తారు. ఈ విధంగా వారివురు యుద్ధం చేస్తూ ఉండగా దేవతలు వారివారి విమానాలు అధిరోహించి వీక్షిస్తుంటారు. బ్రహ్మ, విష్ణువుల మధ్య యుద్ధం అత్యంత ఉత్కంఠతో జరుగుతూ ఉంటే వారు ఒకరి వక్షస్థలం పై మరొకరు అగ్నిహోత్ర సమానమైన బాణాలు సంధించుకొన సాగారు. ఇలా సమరం జరుగుతుండగా, విష్ణువు మాహేశ్వరాస్త్రం, బ్రహ్మ పాశుపతాస్త్రం ఒకరిమీదకు ఒకరు సంధించుకొంటారు. ఆ అస్త్రాలను వారు సంధించిన వెంటనే సమస్త దేవతలకు భీతి కల్గుతుంది. ఏమీ చేయలేక, దేవతలందరు శివునికి నివాసమైన కైలాసానికి బయలు దేరుతారు. ప్రమథగణాలకు నాయకుడైన శివుని నివాసస్థలమైన కైలాసంలో మణులు పొదగబడిన సభా మధ్యలో ఉమాసహితుడై తేజస్సుతో విరాజిల్లుతున్న మహాదేవునికి పరిచారికలు శ్రద్ధతో వింజామరలు వీచుతుంటారు. ఈ విధంగా నున్న ఈశ్వరునికి దేవతలు ఆనందబాష్పాలతో శ్వస్త్రంగమ్ ప్రణమిల్లుతారు. అప్పుడు ప్రమథ గణాలచేత శివుడు దేవతలను దగ్గరకు రమ్మని అహ్వానిస్తాడు. అన్ని విషయాలు ఎరిగిన శివుడు దేవతలతో "బ్రహ్మ, విష్ణువుల యుద్ధము నాకు ముందుగానే తెలియును. మీ కలవరము గాంచిన నాకు మరల చెప్పినట్లైనది " అంటాడు. బ్రహ్మ, విష్ణువులకు ప్రభువైన శివుడు సభలో ఉన్న వంద ప్రమథ గణాలను యుద్ధానికి బయలుదేరమని చెప్పి, తాను అనేక వాద్యములతో అలంకారములతో కూడిన వాహనం పై రంగు రంగుల ధ్వజముతో, వింజామరతో, పుష్పవర్షముతో, సంగీతము నాట్యమాడే గుంపులతో, వాద్య సముహంతో, పార్వతీదేవితో బయలుదేరుతాడు. యుద్ధానికి వెళ్ళిన వెంటనే వాద్యాల ఘోషను ఆపి, రహస్యంగా యుద్ధాన్ని తిలకిస్తాడు. మాహేశ్వరాస్త్రం, పాశుపతాస్త్రం విధ్వంసాన్ని సృష్టించబోయే సమయంలో శివుడు అగ్ని స్తంభ రూపంలో ఆవిర్భవించి ఆ రెండు అస్త్రాలను తనలో ఐక్యం చేసుకొంటాడు. బ్రహ్మ, విష్ణువులు ఆశ్చర్య చకితులై ఆ స్తంభం యొక ఆది, అంతం కనుగొనడం కోసం వారివారి వాహనాలతో బయలు దేరుతారు. విష్ణువు అంతము కనుగొనుటకు వరాహరూపుడై, బ్రహ్మ ఆది తెలుసుకొనుటకు హంసరూపుడై బయలుదేరుతారు. ఎంతపోయినను అంతము తెలియకపోవడం వల్ల విష్ణుమూర్తి వెనుకకు తిరిగి బయలుదేరిన భాగానికి వస్తాడు. బ్రహ్మకు పైకి వెళ్ళే సమయంలో మార్గమధ్యంలో కామధేనువు క్రిందకు దిగుతూను, ఒక మొగలి పువ్వు (బ్రహ్మ, విష్ణువుల సమరాన్ని చూస్తూ పరమేశ్వరుడు నవ్వినప్పుడు ఆయన జటాజూటం నుండి జారినదే ఆ మొగలి పువ్వు) క్రింద పడుతూనూ కనిపించాయి. ఆ రెంటిని చూసి బ్రహ్మ 'నేను ఆది చూశాను అని అసత్యము చెప్పండి. ఆపత్కాలమందు అసత్యము చెప్పడము ధర్మ సమ్మతమే" అని చెప్పి కామధేనువు తోను, మొగలి పువ్వుతోను ఒడంబడిక చేసుకొంటాడు. వాటితో ఒడంబడిక చేసుకొన్న తరువాత బ్రహ్మ తిరిగి స్వస్థానానికి వచ్చి, అక్కడ దస్సి ఉన్న విష్ణువుని చూసి, తాను ఆదిని చూశానని, దానికి సాక్ష్యం కామధేనువు, మొగలి పువ్వు అని చెబుతాడు. అప్పుడు విష్ణువు ఆ మాటను నమ్మి బ్రహ్మకి షోడశోపచారా లతో పూజ చేస్తాడు. కాని,శివుడు ఆ రెండింటిని వివరము అడుగగా, బ్రహ్మ స్తంభం ఆదిని చూడడం నిజమేనని మొగలి పువ్వు చెపుతుంది. కామధేనువు మాత్రం నిజమేనని తల ఊపి, నిజం కాదని తోకను అడ్డంగా ఊపింది. జరిగిన మోసాన్ని తెలుసుకున్న శివుడు కోపోద్రిక్తుడైనాడు.మోసము చేసిన బ్రహ్మను శిక్షించడం కోసం శివుడు అగ్ని లింగ స్వరూపం నుండి సాకారమైన శివుడిగా ప్రత్యక్షం అవుతాడు. అది చూసిన విష్ణువు, బ్రహ్మ సాకారుడైన శివునకు నమస్కరిస్తారు. శివుడు విష్ణువు సత్య వాక్యానికి సంతసించి ఇకనుండి తనతో సమానమైన పూజా కైంకర్యాలు విష్ణువు అందుకొంటాడని, విష్ణువుకి ప్రత్యేకంగా క్షేత్రాలు ఉంటాయని ఆశీర్వదిస్తాడు.




## మహాశివరాత్రి వ్రత కథ

ఒకనాడు కైలాసపర్వత శిఖరముపై పార్వతీపరమేశ్వరులు సుఖాసీనులై ఉండగా పార్వతి శివునితో అన్ని వ్రతములలోను ఉత్తమమగు వ్రతమును భక్తి ముక్తి ప్రదాయకమైన దానిని తెలుపమని కోరెను. అప్పుడు శివుడు శివరాత్రి వ్రతమనుదాని విశేషాలను తెలియజేస్తాడు. దీనిని మాఘబహుళచతుర్దశి నాడు ఆచరించవలెనని, తెలిసికాని, తెలియకగాని ఒక్కమారు చేసినను యముని నుండి తప్పుంచుకొని ముక్తి పొందుదురని దాని దృష్టాంతముగా ఈ క్రింది కథను వినిపించెను. ఒకప్పుడు ఒక పర్వతప్రాంతమున హింసావృత్తిగల వ్యాధుడొకడు వుండెను. అతడు ప్రతి ఉదయం అడవికి వేటకు వెళ్ళి సాయంత్రం ఏదేని మృగమును చంపి తెచ్చుచు కుటుంబాన్ని పోషించేవాడు. కానీ ఒకనాటి ఉదయమున బయలుదేవి అడవియంతా తిరిగినా ఒక్క మృగము కూడా దొరకలేదు. చీకటిపడుతున్నా ఉత్తచేతులతో ఇంటికి వెళ్ళడానికి మనస్కరించక వెనుతిరిగెను. దారిలో అతనికొక తటాకము కనిపించెను. ఏవైనా మృగాలు నీరు త్రాగుట కోసం అచ్చటికి తప్పకుండా వస్తాయని వేచియుండి వాటిని చంపవచ్చునని ఆలోచించి దగ్గరనున్న ఒక చెట్టెక్కి తన చూపులకు అడ్డముగా నున్న ఆకులను, కాయలను విరిచి క్రింద పడవేయసాగెను. చలికి "శివ శివ" యని వణుకుచూ విల్లు ఎక్కిపెట్టి మృగాల కోసం వేచియుండెను. మొదటిజామున ఒక పెంటిలేడి నీరు త్రాగుటకు అక్కడికి వచ్చెను. వ్యాధుడు దానిపై బాణము విడువబోగా లేడి భయపడక "వ్యాధుడా! నన్ను చంపకుము" అని మనుష్యవాక్కులతో ప్రార్థించెను. వ్యాధుడు ఆశ్చర్యపడి మనుష్యులవలె మాట్లాడు నీ సంగతి తెలుపుమని కోరెను. దానికి జింక "నేను పూర్వజన్మమున రంభయను అప్సరసను. హిరణ్యాక్షుడను రాక్షసరాజును ప్రేమించి శివుని పూజించుట మరచితిని. దానికి రుద్రుడు కోపించి కామాతురయైన నీవు, నీ ప్రియుడును జింకలుగా పన్నెండేళ్లు గడిపి ఒక వ్యాధుడు బాణముతో చంపనుండగా శాపవిముక్తులౌదురని సెలవిచ్చెను. నేను గర్భిణిని, అవధ్యను కనుక నన్ను వదలుము. మరొక పెంటిజింక ఇచటికి వచ్చును. అది బాగుగా బలిసినది, కావున దానిని చంపుము. లేనిచో నేను వసతికి వెళ్ళి ప్రసవించి శిశువును బంధువుల కప్పగించి తిరిగివస్తాను" అని అతన్ని వొప్పించి వెళ్ళెను.

రెండవజాము గడిచెను. మరొక పెంటిజింక కనిపించెను. వ్యాధుడు సంతోషించి విల్లెక్కుపెట్టి బాణము విడువబోగా అదిచూచిన జింక భయపడి మానవవాక్కులతో "ఓ వ్యాధుడా, నేను విరహముతో కృశించియున్నాను. నాలో మేదోమాంసములు లేవు. నేను మరణించినా నీ కుటుంబానికి సరిపోను. ఇక్కడికి అత్యంత స్థూలమైన మగజింకయొకటి రాగలదు. దానిని చంపుము, కానిచో నేనే తిరిగివత్తును" అనెను. వ్యాధుడు దానిని కూడా విడిచిపెట్టెను. మూడవజాము వచ్చెను. వ్యాధుడు ఆకలితో జింక కోసం వేచియుండెను. అంతలో ఒక మగజింక అక్కడికి వచ్చెను. వింటితో బాణము విడువబోగా ఆ మృగము వ్యాధుని చూచి మొదటి రెండు పెంటి జింకలు తన ప్రియురాలుల్ని తానే చంపెనా అని ప్రశ్నించెను. అందుకు వ్యాధుడు ఆశ్చర్యపడి రెండు పెంటిజింకలు మరలివచ్చుటకు ప్రతిజ్ఞచేసి వెళ్ళినవి, నిన్ను నాకు ఆహారముగా పంపుతాయని చెప్పాయని అన్నాడు. ఆ మాట విని "నేను ఉదయాన్నే మీ ఇంటికి వచ్చెదను నా భార్య ఋతుమతి. ఆమెతో గడిపి బంధుమిత్రుల అనుజ్ఞపొంది మరలివత్తును అని ప్రమాణములు చేసి వెళ్ళెను. ఇట్లు నాలుగు జాములు గడిచి సూర్యోదయ సమయంలో వ్యాధుడు జింకల కొరకు ఎదురుచూచుచుండెను.

కొంతసేపటికి ఆ నాలుగు జింకలును వచ్చి నన్ను మొదట చంపుము, నన్నే మొదట చంపుమని అనుచు వ్యాధుని ఎదుట మోకరిల్లెను. అతడు మృగముల సత్యనిష్టకు ఆశ్చర్యపడెను. వానిని చంపుటకు అతని మనసు ఒప్పలేదు. తన హింసావృత్తిపై జుగుప్స కలిగెను. "ఓ మృగములారా ! మీ నివాసములకు వెళ్ళుము. నాకు మాంసము అక్కరలేదు. మృగములను బెదరించుట, బంధించుట, చంపుట పాపము. కుటుంబము కొరకు ఇక నేనా పాపము చేయను. ధర్మములకు దయ మూలము. దమయు సత్యఫలము. నీవు నాకు గురువు, ఉపదేష్టవు. కుటుంబ సమేతముగా నీవు వెళ్ళుము. నేనిక సత్యధర్మము నాశ్రయించి అస్త్రములను వదలిపెట్టుదును." అని చెప్పి ధనుర్బాణములను పారవేసి మృగములకు ప్రదక్షిణ మాచరించి నమస్కరించెను. అంతలో ఆకాశమున దేవదుందుభులు మ్రోగెను. పుష్పవృష్టి కురిసెను.

దేవదూతలు మనోహరమగు విమానమును తెచ్చి యిట్లనిరి : ఓ మహానుభావా. శివరాత్రి ప్రభావమున నీ పాతకము క్షీణించింది. ఉపవాసము, జాగరమును జరిపితివి, తెలియకయే యామ, యామమునను పూజించితివి, నీవెక్కినది బిల్వవృక్షము. దానిక్రింద స్వయంభూలింగమొకటి గుబురులో మరుగుపడి యున్నది. నీవు తెలియకయే బిల్వపత్రముల త్రుంచివేసి శివలింగాన్ని పూజించితివి. సశరీరముగా స్వర్గమునకు వెళ్ళుము. మృగరాజా! నీవు సకుటుంబముగా నక్షత్రపదము పొందుము." ఈ కథ వినిపించిన పిదప పరమేశ్వరుడు పార్వతితో నిట్లనెను: దేవీ! ఆ మృగకుటుంబమే ఆకాశమున కనిపించు మృగశిర నక్షత్రము. మూడు నక్షత్రములలో ముందున్న రెండూ జింకపిల్లలు, వెనుకనున్న మూడవది మృగి. ఈ మూడింటిని మృగశీర్ష మందురు. వాని వెనుక నుండు నక్షత్రములలో ఉజ్జ్వలమైనది లుబ్ధక నక్షత్రము.

### బ్రహ్మకు శిక్ష, వరము

శివ పురాణం, విద్వేశ్వర సంహితలోని ఏడవ ఎనిమిదవ అధ్యాయములలో ఉన్నదీ విషయం.

### ఈశ్వర ఉవాచ

అరాజ భయమేతద్వైజగత్సర్వం నశిష్యతి!
తతస్త్వం జహి దండార్హం వహ లోకధురం శిశో!!
వరందదామి తే తత్ర గృహాణ దుర్లభం పరమ్!
వైతానికేషు గృహ్యేషు యజ్ఞేషు చ భవాన్గురుః!!
నిష్ఫలస్త్వదృతే యజ్ఞః సాంగశ్చ సహ దక్షిణః!

శివుడు బ్రహ్మ గర్వము అణచడానికి తన కనుబొమ్మల నుండి భైరవుడిని సృష్టించి పదునైన కత్తితో ఈ బ్రహ్మను శిక్షించుము అని చెబుతాడు. ఆ భైరవుడు వెళ్లి బ్రహ్మ పంచముఖాలలో ఏ ముఖము అయితే అసత్యము చెప్పిందో ఆ ముఖాన్ని పదునైన కత్తితో నరికి వేస్తాడు. అప్పుడు మహావిష్ణువు శివుడి వద్దకు వెళ్లి, పూర్వము ఈశ్వర చిహ్నంగా బ్రహ్మకు ఐదు ముఖాలు ఇచ్చి ఉంటివి. ఈ మొదటి దైవము అగు బ్రహ్మను ఇప్పుడు క్షమించుము అన్నాడు. ఆ మాటలు విన్న శివుడు శరణు జొచ్చిన బ్రహ్మను (పిల్లవానిని తప్పుడు చేతకై దండించి తప్పు తెలుసుకొన్న తరువాత కారుణ్యమును ప్రకటించిన తండ్రిలా) ఉద్దేశించి గొప్ప వరమును ప్రసాదించెను. బ్రాహ్మణి క్షమించి, "ఓ బ్రహ్మ నీకు గొప్పనైన దుర్లభమైన వరమును ఇస్తున్నాను, అగ్నిష్టోమము, దర్శ మొదలగు యజ్ఞములలో నీది గురుస్థానము. ఎవరేని చేసిన యజ్ఞములలో అన్ని అంగములు ఉన్నా అన్నింటినీ సరిగా నిర్వర్తించినా, యజ్ఞనిర్వహణముచేసిన బ్రాహ్మణులకు దక్షిణలు ఇచ్చినా, నీవు లేని యజ్ఞము వ్యర్థము అగును" అని వరమిచ్చెను.

### మొగలి పువ్వుకు శాపము

ఆతరువాత కేతకీపుష్పము వైపు చూసి, అసత్యము పల్కిన నీతో పూజలు ఉండకుండా ఉండు గాక అని అనగానే దేవతలు కేతకీపుష్పాన్ని దూరంగా ఉంచారు. దీనితో కలతచెందిన కేతకీపుష్పము పరమేశ్వరుడవైన నిన్ను చూసిన తరువాత కూడా అసత్య దోషము ఉండునా అని మహాదేవుడిని స్తుతించింది. దానితో ప్రీతి చెందిన శివుడు అసత్యము చెప్పిన నిన్ను ధరించడం జరగదు, కాని కేతకీ పుష్పాన్ని నా భక్తులు ధరిస్తారు. అదేవిధంగా కేతకీ పుష్పము ఛత్ర రూపములో నాపై ఉంటుంది అని చెబుతాడు.

### కామధేనువుకు శాపము

అసత్యాన్ని చెప్పిన కామధేనువును కూడా శివుడు శిక్షించదలచాడు. అసత్యమాడినందుకు పూజలు ఉండవని శివుడు కామధేనువుకు శాపమిచ్చాడు. తోకతో నిజం చెప్పాను కనుక క్షమించుమని కామధేనువు శివుని ప్రాధేయపడింది. భోలాశంకరుడు కనుక, కోపమును దిగమ్రింగి, " మొగము తో అసత్యమాడితివి కనుక నీ మొగము పూజనీయము కాదు; కాని సత్యమాడిన నీ పృష్ఠ భాగము పునీతమై, పూజలనందుకొనును" అని శివుడు వాక్రుచ్చెను. అప్పటి నుండి గోముఖము పూజార్హము కాని దైనది; గోమూత్రము, గోమయము, గోక్షీరములు పునీతములైనవై, పూజా, పురస్కారములలో వాడబడుచున్నవి.

## శివరాత్రి పూజా విధానాలు

శ్రీనగర్ లోని మండి పట్టణంలో శివరాత్రి ఉత్సవాలలో అలంకరించిన శివుని విగ్రహం.

ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపాలతో అర్చించారు. దీనికి మెచ్చి శివుడు అక్కడి వారితో "మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈ రోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదినముగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెబుతాడు. తాను ఈ విధంగా అగ్నిలింగరూపముగా ఆవిర్భవించిన ప్రదేశము అరుణాచలముగా ప్రసిద్ధిచెంద గలదని చెబుతాడు.

### జాగరణము

జాగరణము అనగా ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివపూజా భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివస్వరూపముగా భావించి, దర్శించుటయే నిజమైన జాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీప్యము, శివభక్తులతో కూడి, శివ విషయములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానములో సారూప్యము సిద్ధించునని ఆది శంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణము. జాగరణ దినమున ఉపవాసము ఉంటారు.


ఈ జాగరణ సమయంలో తాము న్న గృహ ఆవరణలోనో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు. సుభమ్ ఓం నమః శివాయః

### రుద్రాభిషేకం

వేదాలలోనుండి ప్రత్యేకమైన మంత్రాలను రుద్ర సూక్తంగా పండితులచే పఠించబడుతుంది. దీనిని శివలింగానికి ప్రాతఃకాలంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివ లింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రామం కూడా పూజలందుకుంటుంది. దీని ద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమార్థం.

### పంచాక్షరి మంత్రం

పంచాక్షరి మంత్రం శివస్తోత్రాలలో అత్యుత్తమమైనది. ఈ మంత్రంలోని పంచ అనగా అయిదు అక్షరాలు "న" "మ" "శి" "వా" "య" (ఓం నమశ్శివాయ) నిరంతరం భక్తితో ఈనాడు పఠిస్తే శివసాయుజ్యం ప్రాప్తిస్తుంది.




## స్పోర్ట్స్ షెడ్యూల్‌తో బిజీగా పెద్ది మూవీ టీమ్.. రంగంలోకి దిగిన గ్లోబల్ స్టార్..

టాలీవుడ్ స్టార్ కపుల్ రామ్ చరణ్, ఉపాసన ఇంట సంబరాల వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. జనవరి 31న రామ్ చరణ్ సతీమణి ఉపాసన కవలలకు జన్మనివ్వడంతో వీళ్ళ కుటుంబం సంతోషంలో మునిగిపోయింది. క్లిన్ కారాతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు ఉపాసన, రామ్ చరణ్ తల్లిదండ్రులుగా ప్రమోషన్ పొందారు. తాజాగా జరిగిన బారసాల వేడుకలో.. పిల్లల పేర్లను శివరామ్, అన్విరా దేవి అంటూ తెలిపారు రామ్ చరణ్. బారసాల వేడుకకు సంబంధించిన ఫోటోలను తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేస్తూ.. పిల్లల పేర్ల అర్థాలను వెల్లడించారు మెగాస్టార్ చిరంజీవి. చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్ నుంచి శివను.. రామ్ చరణ్ నుంచి రామ్‌ను తీసుకుని వారసుడికి శివరామ్ కొణిదెల అని పెట్టారు చరణ్. అలాగే ఇందులో దేవుడి పేర్లు కూడా ఉన్నాయి. మరోవైపు పెద్ద కూతురికి క్లిన్‌కారా అంటూ అమ్మవారి పేరు పెట్టిన చరణ్.. చిన్న కూతురుకు కనక దుర్గ అమ్మవారి ఆశీస్సులతో అన్విరా దేవి అనే నామకరణం చేశారు. కవల పిల్లల బారసాలకు సంబంధించిన ఫోటోలు వచ్చాయి. ఈ వేడుకలో రామ్ చరణ్ తన కూతురు క్లిన్‌కారాను ఆప్యాయంగా ఎత్తుకోగా.. చిరంజీవి దంపతులు కవల పిల్లలను ఎత్తుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో, కుటుంబ సభ్యులందరి మధ్య జరిగిన ఈ వేడుక ఎంతో ఆహ్లాదకరంగా సాగింది. ఈ వేడుక ముగియడంతో త్వరలోనే పెద్ది షూటింగ్‌లో జాయిన్ కానున్నారు చరణ్. ప్రస్తుతం ఈ మూవీ టీమ్ ఏమాత్రం గ్యాప్ లేకుండా షూటింగ్ చేస్తుండటం. చిత్రయూనిట్ తోపాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా వేగంగానే జరుగుతుందట. ఇప్పటికే ఫస్ట్ హాఫ్ కంప్లీట్ చేసిన ఈ మూవీ.. ఇప్పుడు మరో షెడ్యూల్ స్టార్ట్ చేసినట్టు టాక్. ప్రస్తుతం డైరెక్టర్ బుచ్చిబాబు అండ్ టీమ్ కుస్తీపోటీలపై సన్నివేశాలు తీస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో రామ్ చరణ్ లేకుండానే జరుగుతున్నట్లు టాక్. త్వరలోనే చరణ్ షూటింగ్ లో జాయిన్ కానున్నారు.

## జై హనుమాన్ మొదలయ్యేది



పానిండియా బ్లాక్‌బస్టర్ 'హనుమాన్'కి సీక్వెల్‌గా దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కించనున్న పానిండియా ఫిక్షన్ డ్రామా 'జై హనుమాన్'. 'కాంతారా'ఫేం రిషబ్‌శెట్టి ఇందులో ఆంజనేయునిగా కనిపించనున్నారు. కొన్ని నెలల క్రితం హనుమంతుడిగా ఆయన లుక్‌ని కూడా విడుదల చేశారు. దీంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. గత రెండేళ్లుగా రిషబ్‌శెట్టి 'కాంతారా 2' షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈ సినిమా సెట్స్‌కి వెళ్లడం కుదర్లేదు. ఈలోపు దర్శకుడు ప్రశాంత్‌వర్మ పకడ్బందీగా స్క్రిప్ట్ వర్క్‌ని పూర్తి చేశారు. సాయిమాధవ్ బుర్రా మాటలు రాయగా, బౌండ్ స్క్రిప్ట్ సిద్ధమైంది. గత ఏడాది అక్టోబర్‌లో 'కాంతారా 2' కూడా విడుదల కావడంతో, రిషబ్ 'జై హనుమాన్' షూటింగ్‌ని ఎప్పుడు షురూ చేస్తారా? అని ఆడియన్స్ ఆత్రుతగా ఎదురుచూశారు. ఎట్టకేలకు ఆ శుభఘడియ రానే వచ్చింది. 'జై హనుమాన్' పట్టాలెక్కించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. మార్చి 22న పుణ్యక్షేత్రం హంపిలో 'జై హనుమాన్' షూటింగ్ లాంఛనంగా మొదలుకానుంది. అద్యంతం హనుమంతుడి నేపథ్యంలోనే ఈ సినిమా సాగుతుందని సమాచారం. మైత్రీ మూవీమేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## అయినా పట్టించుకోని టాలీవుడ్..

టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కేరళ కుట్టి. కానీ ఇప్పటివరకు తెలుగులో సరైన హిట్టు మాత్రం అందుకోలేదు. ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్. అక్కినేని అఖిల్ హీరోగా నటించిన హలో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. ఈ సినిమా నిరాశ పరిచినప్పటికీ తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో ఆమె చేసిన సినిమాలు అంతగా మెప్పించలేకపోయాయి. ఇక ఇటీవల కొత్త లోక సినిమాతో ఈ ముద్దుగుమ్మ భారీ విజయాన్ని అందుకుంది. డిఫరెంట్ కథతో వచ్చిన ఈ సినిమా రూ.100 కోట్లకు పైగానే వసూలు చేసింది. ఒక్క సినిమాతోనే అటు మలయాళం, ఇటు తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో అవకాశం కోసం వెయిట్ చేస్తుంది. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కళ్యాణి.. తాజాగా బ్లాక్ డ్రెస్ లో స్టన్నింగ్ స్టిల్స్ షేర్ చేసింది. గ్లామర్ ఫోజులతో మతి పోగొట్టే అందాలతో కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ అమ్మడు షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి.



## ఒక్క సినిమాతోనే సెన్సేషన్..

తెలుగులో ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. గ్లామర్ సెన్సేషన్ బ్యూటీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత అవకాశాలు రాకపోవడంతో ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. అలాగే అటు సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్ గా ఉండటం లేదు. కానీ ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా చేతిలో గులాబీలతో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఇంతకీ ఈ ముద్దుగుమ్మ ఎవరో అని ఆలోచిస్తున్నారా..? తనే హీరోయిన్ నేహా శెట్టి. మెహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోయినా.. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించింది. కానీ ఆమెకు బ్రేక్ ఇచ్చిన సినిమా మాత్రం డీజే టిల్లు. సిద్ధు జొన్నలగడ్డతో చేసిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టైంది. ఈ మూవీతోనే తెలుగులో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఇందులో లుక్స్ తోపాటు గ్లామర్ బ్యూటీగానూ కట్టిపడేసింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. కానీ అలా జరగలేదు. చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం చూస్తున్న నేహా.. ఇటీవల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ థియేటర్లలో మాత్రం ఈ బ్యూటీ స్పెషల్ సాంగ్ తొలగించి చివరకు యూట్యూబ్ లో రిలీజ్ చేసింది చిత్రయూనిట్.

## ఓటీటీలో.. ఓం నమశ్శివాయ





జాగారం అంటేనే శివనామ స్మరణతో గడపడం. మనసును భక్తిలో నిమగ్నం చేయడం. అయితే, ఆలయాలకు వెళ్లడం, పురాణ కాలక్షేపాలు చేయడం.. కొందరికి సాధ్యం కాకపోవచ్చు. అలాంటివారంతా ఇంట్లోనే టీవీలు చూస్తూ జాగారం చేయవచ్చు. ఓటీటీ వేదికగా అద్భుతమైన పౌరాణిక, భక్తిరస సినిమాలను వీక్షించవచ్చు. ఆయా సినిమాలు చూస్తూ.. శివరాత్రి పుణ్యదినాన శివతత్వాన్ని, శైవ క్షేత్రాల మహిమలను తెలుసుకోవచ్చు.

**భక్త కన్నప్ప :** దేవుడికి కావాల్సింది శాస్త్రోక్తమైన పూజ కాదు. స్వచ్ఛమైన ప్రేమ అని చాటిచెప్పే చిత్రం. రెబల్ స్టార్ కృష్ణంరాజు.. తిన్నడిగా నట విశ్వరూపం చూపించారు. బాపు దర్శకత్వంలో 1976లో వచ్చిన భక్త కన్నప్ప.. తెలుగు సినీచరిత్రలోనే గొప్ప భక్తిరస చిత్రంగా మన్ననలు అందుకున్నది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్నది.

**భూకైలాస్ :** శివరాత్రికి మూలమైన లింగోద్భవ గాథను వివరించే సినిమా. రావణాసురుడిగా ఎన్టీయార్ నటన, శివుడిగా నాగభూషణం ఆహార్యం.. ఈ సినిమాను భక్తిరస చిత్రాల్లో సాటిలేనిదిగా నిలబెట్టాయి. ఇందులో నారదుడిగా ఏయన్నార్ నటించడం మరో విశేషం. 1958లో వచ్చిన భూకైలాస్.. ఒక అద్భుతమైన కళాఖండంగా ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయింది. జాగారం సమయంలో తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. యూట్యూబ్‌తోపాటు ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లేలో ఈ సినిమాను వీక్షించొచ్చు.

**దక్షయజ్ఞం:** శక్తిపీఠాల ఆవిర్భావం గురించి తెలుసుకోవాలంటే.. దక్షయజ్ఞం చూడాల్సిందే! ఈ చిత్రానికి దర్శకుడు కడారు నాగభూషణం. శివుడిగా ఎన్టీయార్, దక్ష ప్రజాపతిగా ఎస్వీఆర్.. పోటీపడి నటించారు. వీరిద్దరి మధ్య వచ్చే సంభాషణలు, అహంకారానికి ఆధ్యాత్మికతకు మధ్య జరిగే పోరాటం అద్భుతంగా సాగుతుంది. ముఖ్యంగా, శివుడి తాండవం, సతీదేవి అగ్నికి ఆహుతి అయినప్పుడు శివుడు ఆగ్రహంతో వీరభద్రుడిని సృష్టించే ఘట్టం మంత్రముగ్ధులను చేస్తాయి. యూట్యూబ్‌తోపాటు ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లేలో ఈ సినిమాను వీక్షించొచ్చు.

**శ్రీ మంజునాథ:** ఆధునిక కాలంలో వచ్చిన అద్భుతమైన సామాజికభక్తిరస చిత్రం. పరమశివుడిగా చిరంజీవి నటన, ఆహార్యం.. ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక శివభక్తుడైన మంజునాథుడిగా అర్జున్ అద్భుతంగా నటించాడు. భక్తిరస చిత్రాలకు కమర్షియల్ హంగులద్ది తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన కె.రాఘవేంద్రరావు ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈటీవీ విన్‌తోపాటు ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లేలో స్ట్రీమింగ్ అవుతున్నది.

**శ్రీకాళహస్తి మహాత్మ్యం:** శ్రీకాళహస్తి క్షేత్ర ప్రాముఖ్యతను, తిన్నడి భక్తిని ఎంతో హృద్యంగా చూపిస్తుందీ చిత్రం. ఈ సినిమాలో కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నటన.. అభిమానులను కట్టిపడేస్తుంది. ఈ సినిమా యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్నది. వీటితోపాటు ఎన్టీయార్ దర్శకత్వంలో 1961లో రూపొందిన 'సీతారామ కళ్యాణం' సినిమా కూడా క్లాసిక్ మాస్టర్‌పీస్. సీతారాముల కథే అయినా.. రావణుడి శివభక్తిని ఈ చిత్రంలో ప్రత్యేకంగా చూపించారు. ఇందులో రావణాసురుడిగా ఎన్టీయార్ అద్భుతమైన నటనతో మెప్పించారు. అద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించిన ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్రగా తెరకెక్కిన సినిమా.. జగద్గురు ఆదిశంకర. 2013లో విడుదలైన ఈ సినిమా.. శివతత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**